




ఎలిఫెంట్ క్యాంప్‌లో ఓ కుంకీ వద్ద పీసీసీఎఫ్ శ్రీధర్, అటవీశాఖ అధికారులు



అడవుల్లో ఆపరేషన్‌కు శనివారం రాత్రి వెళుతున్న కుంకీలు

గజ దాడులనుంచి ఉపశమనం దొరికేనా?

● 'కుంకీ' ట్రయల్ ఆపరేషన్ సక్సెస్ ● 70 రోజుల శిక్షణ తర్వాత రంగంలోకి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మదపుటేనుగులను అదుపులోకి తెచ్చేందుకు అటవీ శాఖ పలమనేరు ప్రాంతంలో చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఇటు అటవీశాఖ అధికారుల్లో, అటు పంటలు, ప్రాణాలు నష్టపోతున్న రైతుల్లో ఉపశమనం కనబడుతోంది.'ఆపరేషన్ కుంకీ' ట్రయల్ రన్ విజయవంతం కావడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తోపాటు అటవీశాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అటవీ శాఖాధికారులకు అభినందనలు వచ్చాయి.మే 21వ తేదీన కర్ణాటక నుంచి వచ్చిన నాలుగు కుంకీ ఏనుగులు పలమనేరు చేరాయి. ఇక్కడి వాతావరణానికి అవి అలవాటు పడటానికి నెల రోజులు పట్టింది.కుంకీలతో వచ్చిన కర్ణాటక మావటీలు ఏనుగులతో పాటు ఇక్కడి మావటీలకు నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఏనుగుల డ్రైవ్‌పై జిల్లా అటవీశాఖలో పనిచేస్తున్న 40మంది బెంగళూరులోని దుబేరా ఎలిఫెంట్ బేస్ క్యాంపులో శిక్షణ పొందారు. వీరిలో 17 మంది ఏనుగుల డ్రైవ్‌లో నైపుణ్యం సాధించారు. దీంతో కర్ణాటక మావటీలు వెళ్లిన తర్వాత శిక్షణ పొందిన 17 మంది మావటీలు కుంకీలకు శిక్షణ మొదలు పెట్టారు. నాలుగు కుంకీలను వారి ఆధీనంలోకి తెచ్చుకోడానికి మరో 40 రోజుల సమయం పట్టింది.కుంకీలకు, మావటీలకు మధ్య సమన్వయం కుదరడంతో ట్రయల్ రన్ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. డీఎఫ్‌వో భరణి సూచనలతో ఆగస్టు 1న కుంకీలకు పరీక్షలు నిర్వహించారు. వాటి శారీరక దృఢత్వం వంటివి పరిశీలించాక మూడు ఏనుగులు మాత్రమే ఫిట్ కావడంతో వాటితోనే శనివారం ట్రయల్‌రన్ ఆపరేషన్ చేపట్టడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టేకుమంద ప్రాంతంలో తిరుగుతున్న 8 ఏనుగులపై కుంకీలైన కృష్ణ, జయంత్, వినాయక్‌లను ప్రయోగించారు. ముగ్గురు మావటీలు కుంకీలను అటువైపు తీసుకుపోయి, అటవీ ప్రాంతంలోని ఏనుగులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవడంతోపాటు అటవీ ప్రాంతంలోకి మళ్లించగలిగారు.

● సంచార ప్రాంతాల్లోనే ఆపరేషన్ కుంకీ...

ఏనుగులు నిత్యం సంచరించే ప్రాంతాల్లో కుంకీ ఏనుగులతో డ్రైవ్ చేపట్టాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. పలమనేరులోని గవిని చెరువు, ముసలి మడుగు, పులిచెర్ల మండలంలోని కల్లూరు, పాళ్యం, దేవళంపేట, కమ్మపల్లె, పాతపేట, చల్లావారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లె, మంగళంపేట, గుడిపాల మండలంలోని చిత్తపార, కమ్మపల్లె, బొమ్మసముద్రం, పుంగనూరు మండలంలోని ఆవులపల్లె, రాంపల్లె, గంటావారిపల్లె, గురికానవారిపల్లె, చెరుకువారిపల్లె, బంగారుపాళ్యం మండలంలోని రాగిమానుపెంట, బోడబండ్ల, ఐరాల మండలంలోని నాగవాండ్లపల్లె, గుండ్లపల్లె, నాంపల్లె ప్రాంతాల్లో కుంకీ ఆపరేషన్లు నిర్వహించనున్నారు.

● రోజుకు ఆరు గంటలే

రోజుకు కేవలం ఆరు గంటలు మాత్రమే కుంకీ ఏనుగులను ఆపరేషన్‌కు వినియోగించాల్సి ఉంటుంది. రోజూ వాటికి దాదాపు 250 కిలోల ఆహారం (గడ్డి, రాగిసంగటి, వరి, చెరకు) అందించాలి. ఆపరేషన్ చేపట్టే ముందు కుంకీ ఏనుగులకు కడుపు నిండా ఆహారం పెట్టాలి. ఎక్కువ దూరం కుంకీ ఏనుగులను నడిపించే వీలులేదు. వాటి శరీర దృఢత్వ ఆధారంగా 10 నుంచి 15 కిలోమీటర్లు మాత్రమే డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. కుంకీ ఏనుగులను నడిపించేందుకు ప్రధాన మావటీలతోపాటు శిక్షణ పొందిన మావటీలు సైతం కావాల్సి ఉంది. కుంకీ ఏనుగులు ఏ క్షణంలోనైనా వింతగా ప్రవర్తించినా, మావటీల కమాండ్‌కు వ్యతిరేకంగా వ్యవహరించినా, వాటిని తక్షణం అదుపులోకి తెచ్చుకునేందుకు ఇతర మావటీలు సహాయ పడాల్సి ఉంది. ఇదే క్రమంలో ఒక్కోసారి మదపుటేనుగులు కుంకీలపై తిరగబడే పరిస్థితుల్లో వాటి బారి నుంచి మావటీలు కుంకీలను కాపాడాల్సిన అవసరం ఉంది.

● అప్రమత్తత అవసరం

ఏనుగులు నిత్యం సంచరించే అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అటవీశాఖ సిబ్బందితో పాటు రైతులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలి. ఏనుగుల సంచారం గుర్తించిన వెంటనే, కుంకీలు ఆ ప్రాంతానికి చేరుకునే వరకు గ్రామాల వైపు ఏనుగులు రాకుండా అటవీ సిబ్బంది చూసుకోవాల్సి ఉంది. కుంకీ ఏనుగులు ఎక్కువ దూరం నడిపించే వీలు లేనందున, ననియాల నుంచి ఆపరేషన్ నిర్వహించే ప్రాంతానికి వాహనంలో రవాణా చేయాల్సి వుంది.

జిల్లాలో 90 ఏనుగులు

చిత్తూరు జిల్లా అటవీ ప్రాంతమైన కారుణ్య అభయారణ్యంలో ప్రస్తుతం 90 ఏనుగులున్నట్లు అటవీ శాఖ అధికారులు లెక్కలు కట్టారు.వీటిలో 18ఏనుగుల గుంపు పులిచెర్ల మండలంలో, 13 ఏనుగుల గుంపు పలమనేరు, బంగారుపాళ్యంలో సంచరిస్తున్నాయి.పలమనేరులో ఒంటరి ఏనుగు, కల్లూరులో రెండు మదపుటేనుగుల సంచారం ఉందని గుర్తించారు.

కల్లూరు-ఐరాల ప్రాంతాల్లో సెకండ్ డ్రైవ్



ఆపరేషన్ కుంకీ విజయవంతమైన క్రమంలో కల్లూరు-ఐరాల అటవీ ప్రాంతాల్లో సెకండ్ డ్రైవ్ నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కల్లూరు ప్రాంతంలో సోలార్ రిఫ్లెక్టర్ లైట్లు అమర్చిన క్రమంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల ఏనుగులను కల్లూరు-ఐరాల మధ్య ప్రాంతాల్లోని అడవుల్లోకి చేర్చి, అక్కడి నుంచి కౌండిన్య అభయారణ్యంలోకి పంపి, అవి తిరిగి జనారణ్యంలోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. - డీఎఫ్‌వో భరణి

గజదాడులకు ఇక చెక్

● పీసీసీఎఫ్ శ్రీధర్

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి రైతులు పండిస్తున్న పంటలను తొక్కి నష్టపరుస్తున్న మదపుటేనుగులను ఇకపై శాంక్చురీ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలకే పరిమితం చేస్తామని పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) డాక్టర్ శ్రీధర్ తెలిపారు.గజదాడుల నివారణ నిమిత్తం కర్ణాటక నుంచి తీసుకొచ్చిన కుంకీల కోసం పలమనేరు సమీపంలోని ముసలి మడుగు వద్ద ఏర్పాటు చేసిన క్యాంపును ఆయన మంగళవారం సందర్శించారు.కుంకీలకోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలిఫెంట్‌క్యాంపులో కుంకీలకోసం నిర్మించిన నీటికుంటలో స్నానం చేస్తున్న కుంకీని ఆయన పరిశీలించారు.కుంకీలకోసం తయారు చేసిన సంగటి ముద్దలను కూడా పరిశీలించారు. ప్రస్తుతం కుంకీలకోసం వెటర్నరీ క్లీనిక్ వుందని, త్వరలో వెటర్నరీ ఆస్పత్రి కూడా నిర్మిస్తున్నామని, కుంకీలను సంరక్షించే మావటీలకు ప్రస్తుతం రెండు క్వార్టర్స్ నిర్మిస్తున్నామని ఆయనకు అధికారులు తెలిపారు.ఎలిఫెంట్ క్యాంపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే వైర్‌లెస్ సెట్లు కూడా ఏర్పాటు చేసుకోవాలని డాక్టర్ శ్రీధర్ సూచించారు. రెండ్రోజుల క్రితం టేకుమంద అటవీప్రాంతంలో ఉన్న 14 ఏనుగుల గుంపును కుంకీలైన కృష్ణ, జయంత్, వినాయక్ ద్వారా ఎలిఫెంట్ శాంక్చురీకి తరలించిన వైనాన్ని అడిగి తెలుసుకొన్నారు. ఇక జిల్లాలో పంటలను ఏనుగులు నాశనం చేసే పరిస్థితులు తలెత్తకుండా వాటిని పూర్తిగా ఎలిఫెంట్ శాంక్చురీ లోతట్టుప్రాంతాలకు కుంకీల ద్వారా మళ్లించాలని సూచించారు.ఈ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను అటవీ శాఖ అధికారులకు వివరించారు. సోమల మండలంలో ఇటీవల ఒక రైతును దాడి చేసి చంపివేసిన ఏనుగుల గుంపును కూడా పలమనేరు ఎలిఫెంట్ శాంక్చురీ లోతట్టుకు తరలించడానికి చర్యలు తీసుకొంటున్నామని అటవీశాఖ అధికారులు డాక్టర్ శ్రీధర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం కన్జర్వేటర్ యశోదాబాయి, తిరుపతి కన్జర్వేటర్ సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి, పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్ నారాయణ, రిటైర్డు ఫారెస్టు రేంజర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



పంద్యాల మడుగు అటవీ సరిహద్దుల్లో ఒంటరి ఏనుగు

మళ్లీ ప్రత్యక్షమైన ఒంటరి ఏనుగు

రామకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అటవీ ప్రాంత ప్రజలకు ఒంటరి ఏనుగు భయం వీడడం లేదు. గత గురువారం ఎస్.గొల్లపల్లె గ్రామ సమీపంలో ఒంటరి ఏనుగు సంచారం గ్రామస్తులను ఆందోళనకు గురిచేసింది. గురువారం రాత్రి అడవిలో నుంచి ఒంటరి ఏనుగు పొలాల వైపు వస్తుండగా గ్రామస్తులు గుమనించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అటవీశాఖ అధికారులు ట్రాకర్లతో కలిసి ఏనుగు జాడ తెలుసుకుని దానిని అడవిలోకి తరిమేందుకు ప్రయత్నించారు. చివరకు శుక్రవారం ఉదయం అది అడవికి, గ్రామానికి మధ్య గల ఓ కుంటలో సంచరిస్తుండగా గమనించారు. టపాకాయలు పేల్చి, డప్పులు పేల్చుతూ అడవిలోకి తరిమేశారు. తిరిగి మంగళవారం ఉదయం 6గంటలకు పంద్యాలమడుగు, ఎస్.గొల్లపల్లె సమీప పొలాల్లో ఒంటరి ఏనుగు ప్రత్యక్షమైంది. పంద్యాలమడుగు, ఎస్.గొల్లపల్లె గ్రామాల సమీపంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగు మదపుటేనుగు కాదని, జనమెవరూ భయపడాల్సిన అవసరం లేదని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. అయితే చీకటి పడ్డాక రైతులెవరూ పొలాల వద్దకు వెళ్ళరాదని సూచించారు.ఏనుగులు కన్పిస్తే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయరాదని సూచించారు.

భక్తులు ఇబ్బంది పడకూడదు

● క్షేత్రస్థాయి సిబ్బందిదే కీలక పాత్ర ● 21 రోజులపాటు జరిగే వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

● ఉభయదారులూ సహకరించాలి ● కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ సూచన



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్పీ మణికంఠ, ఆలయ ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 'కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఇబ్బంది పడకుండా చూడాలి. దీనికి క్షేత్రస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్పీ మణికంఠ అన్నారు. ఆలయ ఈవో కార్యాలయ భవనం వద్ద ఉన్న సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి అధికారులతో ఈవో పెంచలకిషోర్ అధ్యక్షత బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 21 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని కోరారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే వీఐపీలకు, ఉభయదారులకు స్వామి దర్శనానికి ప్రత్యేక సమయం కేటాయిస్తామని చెప్పారు. అలాగే ప్రతి సామాన్య భక్తుడూ తమకు వీఐపీతో సమానమని, ఉద్యోగులు భక్తితో సేవ చేస్తే బాగుంటుందని సూచించారు. బ్రహ్మోత్సవాల్లో విస్తృతంగా అన్నదానం చేయడానికి తగిన ఏర్పాట్లను చేస్తామన్నారు. ఆలయం వద్ద విద్యుత్ అసౌకర్యం కల్గకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిత్తూరు, తిరుపతి నుంచి ఆర్టీసీ బస్సులను అదనంగా నడపాలన్నారు. ప్రొటోకాల్ విధులకు తహసీల్దార్లు, డీటీలను నియమించుకోవాలని ఆర్డీవో శ్రీనివాసులుకు సూచనలిచ్చారు. చిత్తూరు నుంచి కాణిపాకం వచ్చే రహదారిలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లు, నైపుణ్యం కలిగిన డాక్టర్లను నియమించాలని డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్‌కు ఆదేశాలిచ్చారు. ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉభయదారులు, భక్తులు సహకరించాలని కోరారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా 21 రోజుల పాటు తాను కూడా సామాన్య భక్తుడిలా స్వామి దర్శనానికి విచ్చేస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, తహసీల్దార్ లోకేశ్వరి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు నాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్ బాబు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

27నుంచి కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. 27న వినాయక చవితితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.28న ధ్వజారోహణం ,హంస వాహన సేవ, 29న స్వర్ణ నెమలి వాహనం, 30న మూషిక వాహన సేవ, 31న స్వర్ణ శేషవాహన సేవలు, సెప్టెంబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహన సేవ, 2న గజ వాహన సేవ, 3న రథోత్సవం, 4న తిరుకల్యాణం, అశ్వవాహన సేవ, 5న ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికారనంది వాహన సేవ, 7న రావణ బ్రహ్మ వాహన సేవ చంద్ర గ్రహణం కారణంగా ఉదయం నిర్వహిస్తారు. 8న యాళి వాహన సేవ, 9న సూర్యప్రభ వాహన సేవ, 10న చంద్రప్రభ వాహన సేవ, 11న కల్ప వృక్ష వాహన సేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి సేవ, 14న కామధేను వాహన సేవ, 15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

చౌక దుకాణాల్లో ఫుడ్ కమిషన్ మెంబర్ తనిఖీలు



కోడిగుడ్లను పరిశీలిస్తున్న దేవి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి రెండ్రోజుల జిల్లా పర్యటనకు చిత్తూరు నగరానికి చేరుకున్నారు. ఆర్‌అండ్‌బీ వసతి గృహం వద్ద డీఎస్వో శంకరన్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. మంగళవారం చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం, పుంగనూరు మండలాల్లోని చౌకదుకాణాలతోపాటు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీచేశారు. మధ్యాహ్న భోజన పథకానికి వినియోగిస్తున్న బియ్యం నాణ్యత వివరాలు పరిశీలించారు. రేషన్‌షాపుల్లో డీలర్లు నగదురహిత బియ్యంకోసం డబ్బులు వసూలు చేస్తున్నారా.. అరకిలో పంచదారకు రూ.17కు మించి వసూలు చేస్తున్నారా.. మగ్గిపోయిన బియ్యం ఇస్తున్నారా.. వంటి ప్రశ్నలడిగి వివరాలు తెలుసుకున్నారు. రాత్రి చిత్తూరుకు చేరుకుని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బసచేశారు. బుధవారం కూడా జిల్లాలో తనిఖీలు చేయనున్నారు.



ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న అరుణ

మణీంద్రం ఎంపీటీసీగా టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవం

రామకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ సభ్యురాలిగా టీడీపీ అభ్యర్థిని అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆమెపై పోటీ చేసిన విశాలాక్షి(టీడీపీ), అర్పిత(వైసీపీ) నామినేషన్లు తిరస్కరించబడడంతో అరుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్ మంగళవారం సాయంత్రం ప్రకటించారు.టీడీపీ నేతలతో కలిసి ఎన్నికల అధికారి నుంచి అరుణ డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. అనంతరం ఎంపీటీసీగా ఎన్నికైన అరుణను, ఆమె భర్త,ఐటీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డిని టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు.టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి,టీడీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో 70 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 27 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. బంగారుపాళ్యంలో అత్యధికంగా 70 మి.మీ, తవణంపల్లెలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. యాదమరిలో 52.6, గుడిపాలలో 37.8, పాలసముద్రంలో 33.2, గుడుపల్లెలో 24.6, పుంగనూరులో 20.4, పలమనేరులో 18.8, గంగవరం, కార్వేటినగరంలో 17.2, గంగాధరనెల్లూరులో 17, శాంతిపురంలో 16.2, విజయపురంలో 15.4, రామకుప్పంలో 14.2, నింద్రలో 10.2, కుప్పంలో 9.6, చిత్తూరు రూరల్‌లో 8.6, శ్రీరంగరాజపురంలో 8.4, బైరెడ్డిపల్లెలో 8.2, నగరిలో 7.8, చిత్తూరు అర్బన్‌లో 6.4, పెద్దపంజాణిలో 5.6, సదుంలో 4.2, వెదురుకుప్పంలో 4, చౌడేపల్లెలో 3.2, వి.కోటలో 2.4 మి.మీ వర్షం కురిసింది.

కంటైనర్‌ను ఢీకొన్న కారు



ధ్వంసమైన కారు - శ్రీకాంత్, లక్ష్మీదేవి మృతదేహాలు

● మృతి చెందిన తల్లి, కుమారుడు, మనవడు

తవణంపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని ఎలాక్ట్రానిక్ సిటీకి చెందిన శ్రీకాంత్(34) తన తల్లి లక్ష్మీదేవి(55), కుమారుడు శ్రీయాన్(3)తో కలిసి తిరుమలేశుడిని దర్శించుకుని కారులో మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రానికి తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిపై తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపాన ఉన్న నయారా పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులోని శ్రీకాంత్, లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడ్డ శ్రీయాన్ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పుంజుకుంటున్న రిజిస్ట్రేషన్ రాబడి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో రిజిస్ట్రేషన్‌శాఖ రాబడి పుంజుకుంటోందని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వం రూ.73.08 కోట్ల లక్ష్యం నిర్ణయించగా, రూ.51.97 కోట్లు వసూలు చేసి 72.22శాతం లక్ష్యాన్ని సాధించామని చెప్పారు.నెలలవారీగా.. ఏప్రిల్‌లో రూ.17.45 కోట్లకు రూ.12.24 కోట్లు (70.15శాతం), మేలో రూ.15.27 కోట్లకు రూ.12.12 కోట్లు (79.41శాతం),జూన్‌లో రూ.17.45 కోట్లకు రూ.13.79 కోట్లు (79.02శాతం), జూలైలో రూ.22.91 కోట్లకు రూ.13.82 కోట్ల (60.32శాతం) వసూళ్లు జరిగాయని వివరించారు. గత ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో రూ.41.31 కోట్లు మాత్రమే వసూళ్లు జరిగాయని చెప్పారు.

రుయాలో 40 రోజుల బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స




కోలుకున్న పురిటిబిడ్డతో తల్లిదండ్రులు, సర్జరీ చేసిన వైద్యులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కిందపడటంతో తలలో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమంగా ఉన్న 40 రోజుల పురిటి బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టామని తిరుపతిలోని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ జయచంద్ర నాయుడు తెలిపారు. దీనిపై మంగళవారం ఆయన రుయాస్పత్రిలో అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'వెంకటగిరికి చెందిన స్వాతి, రఘు దంపతుల 40 రోజుల పాప చేతిలో నుంచి కింద పడటంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. తలలో రక్తం గడ్డ కట్టింది. దీంతో మూర్ఛవ్యాధి కూడా వచ్చి పాప అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే ఆ పురిటిబిడ్డను తల్లిదండ్రులు రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి నిపుణులైన న్యూరోసర్జరీ వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ అనంతకుమార్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్, అనస్థీషియా వైద్యులు డాక్టర్ రాధ, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రీనివాసుల సాయంతో చిన్నారికి అతిక్లిష్టమైన శస్త్ర చికిత్సను నిర్వహించి చిన్నారి ప్రాణాలు నిలబెట్టారు. ప్రస్తుతం చిన్నారి పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశాం' అని చెప్పారు. వైద్య బృందానికి చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన్నర కిలో గంజాయి స్వాధీనం

తిరుచానూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ దామినేడు హౌసింగ్ కాలనీలో మణి, భరత్‌ను అరెస్టు చేసి ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఓ వివాహితపై మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడిన కార్తీక్‌కు వీరు స్నేహితులు. దీంతో ఈ హౌసింగ్‌కాలనీలో సంఘ విద్రోహశక్తులు పెరిగిపోయారు. ఫలితంగా పలు నేరసంఘటనలు జరుగుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కార్డన్ సెర్చ్ నిర్వహించి నేరస్థులను కట్టడిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.21 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,928

తలనీలాలు సమర్పించినవారు: 29,297



పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఐసర్‌లో సందడిగా

- 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- క్యాంపస్‌లో వెల్లివిరిసిన ఉత్సాహం

పట్టాభిషేకం



ఫొటో పాయింట్



చివరగా ఓ సెల్ఫీ

ఏర్పేడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐసర్ ఆరో స్నాతకోత్సవం ఆనందోత్సాహాలకు వేదికైంది. మంగళవారం ఉల్లాస వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. పట్టాలను అందుకుంటూ పట్టరాని సంతోషాన్ని పంచుకున్నారు. కేరింతలు కొట్టారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గోదావరి బయో రిఫైనరీస్ చైర్మన్, విద్యా విహార్ యూనివర్సిటీ ఛాన్సలర్ సమీర్ సోమయ్య హాజరయ్యారు. ముందుగా ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య చేతుల మీదుగా 255 మంది విద్యార్థులకు డిగ్రీలను అందుకున్నారు. సమీర్ సోమయ్య, బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఖిల్లుసింగ్ యాదవ్, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్యలు వివిధ రంగాల్లో, విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, రజత పతకాలను ప్రదానం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ కోహ్లి, జాయింట్ రిజిస్ట్రార్ రమేష్, డీన్లు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్టైల్ అదిరిపోలా..!

భావోద్వేగాల నడుమ వీడ్కోలు

తిరుపతి ఐసర్‌లో తమ చదువు ముగించి పట్టాలందుకున్న విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు.కొందరి కళ్లలో సన్నటి కన్నీటి పొర తొంగిచూసింది. విద్యాసంస్థను వీడిపోతున్నామనే బాధను దిగమింగుకుంటూ విద్యార్థులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఐదేళ్ల పాటు కలిసి చదువుకుని, శాస్త్రీయ పరిశోధనల్లో మేటి అనిపించుకున్న వీరంతా ఆటోగ్రాఫ్‌లు ఇచ్చుకుంటూ ఒకరికొకరు వీడ్కోలు పలికారు.

పట్టాల పండుగలో సందడి

స్నాతకోత్సవానికి 255 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్నేహితులు ఉత్సాహంగా హాజరయ్యారు. 22 పీహెచ్‌డీలు, 8 సమగ్ర పీహెచ్‌డీలు, 3 ఎంఎస్ డిగ్రీలు, 141 ఫ్లాగ్‌షిప్ డీఎస్ ఎంఎస్ డిగ్రీలు, 69 ప్రొఫెషనల్ మాస్టర్ డిగ్రీలు, 6 డీఎస్ డిగ్రీలు, 6 డీఎస్సీ డిగ్రీ పట్టాలను విద్యార్థులు అందుకుంటున్నప్పుడు హాలు కరతాళధ్వనులతో మారుమోగింది. కొంతమంది విద్యార్థులు డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ కోహ్లీతో కలిసి ఉత్సాహం పంచుకున్నారు.



స్నాతకోత్సవానికి హాజరైన బోర్డ్ ఆఫ్ గవర్నర్ సెనేట్ కమిటీ సభ్యులు

భవిష్యత్ శాస్త్రీయశక్తిగా తిరుపతి ఐసర్

తిరుపతి ఐసర్ భవిష్యత్ శాస్త్రీయ ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మారిందని, ఐసర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య చెప్పారు. స్నాతకోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో తమ విద్యాసంస్థ శాస్త్రీయ శక్తిగా ఎదుగుతుందన్నారు ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలకు శాస్త్రీయ దీపకాంతిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 210 పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ప్రకారం తిరుపతి ఐసర్ దేశంలోన్ని 33వ ర్యాంకు సాధించిందన్నారు. స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో టాప్ 2 పర్సెంట్ శాస్త్రవేత్తల్లో 8మంది తిరుపతి ఐసర్ ఫ్యాకల్టీ ఉన్నారన్నారు. ఈ యేడాది నుంచి ఎంఎస్ రీసెర్చ్, డీఎస్ ఇన్ ఎకనామిక్స్, స్టాటికల్ సైన్స్(బీసీ-ఈఎస్ఎస్)కు శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతి ఐసర్‌లో విద్యార్థులకు ఇంటిని మర్చిపోయే వాతావరణముందన్నారు. అత్యాధునిక సదుపాయాలు కల్పించామన్నారు. రూ.9 కోట్లతో క్రికెట్ స్టేడియాన్ని మల్టీపర్పస్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

బిడ్డతో హాజరైన విద్యార్థిని

కేరళకు చెందిన డోనామారియా ఐసర్‌లో ఐదేళ్లు చదివింది. స్నాతకోత్సవానికి భర్త ప్రవీణ్, రెండు నెలల చిన్నారితో కలిసి హాజరై పట్టాను అందుకుంది. ఆమెను పలువురు అభినందించారు.



అమ్మకు పట్టా..

అవార్డులు అందుకున్న వారు వీరే

తిరుపతి ఐసర్‌లో విశేషప్రతిభ కనబరిచిన కొందరు విద్యార్థులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. డీఎస్ ఎంఎస్ ప్రోగ్రాంలో హనీఫ్ ముఖోపాధ్యాయ్(బంగారు పతకం) మ్యాథమెటిక్స్‌లో ఆర్‌సీ విష్ణు ప్రశాంత్(రజతం), డీఎస్ఎంఎస్‌లో ఆర్.విఘ్నేశ్వరన్(సిల్వర్) బీఎస్ఎంఎస్ పోగ్రాంలోఆస్మా చిరుణి(బెస్ట్ గ్రాడ్యుయేటింగ్ స్టూడెంట్), అర్జిత్ శంకర్ బెనర్జీ (బెస్ట్ స్టూడెంట్ క్యాంపస్) పురస్కారాలు పొందారు.



సిల్వర్ మెడల్ అందుకుంటున్న విఘ్నేశ్వరన్, ఆర్‌సీ విష్ణుప్రశాంత్.. మరో రెండు విభాగాల్లో అవార్డు తీసుకుంటున్న టి.అస్మాషిరిన్, అర్జిత్ శంకర్ బెనర్జీ



బెస్ట్ బేబీ అవార్డు అందుకుంటున్న తల్లి నాగలక్ష్మి

తల్లిపాలతో శిశువుకు పరిపూర్ణ ఆరోగ్యం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నవజాతశిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం చాలా శ్రేయస్కరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఇచ్చే తొలి టీకా అన్నారు. కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలని సూచించారు. తల్లిపాలలో అనేక పోషకాలు బిడ్డలకు లభిస్తాయన్నారు. గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయాల్సిన బాధ్యత ఆశా వర్కర్లపై కూడా ఉందన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఐవో శాంతకుమరి, ప్రొఫెసర్ అరుణ, టాటాట్రస్టు మేనేజరు సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ బేబీ అవార్డును తల్లి నాగలక్ష్మికి అందజేశారు.

ఆల్బెండజెల్ మాత్రలను పంపిణీ చేయండి

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజెల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అధికారులతో సమక్షించారు. ఆగస్టు 12న జరిగే జాతీయ డీవార్మింగ్‌డేను పురస్కరంచుకుని పిల్లలందరి ఆల్బెండజెల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. ఆరోజు ఎవరైన లేకపోతే 20న పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' అవినీతిలో నిర్లక్ష్యం

- ముగ్గురు సిబ్బంది సస్పెన్షన్

రామచంద్రాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.2.29లక్షల మేర అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బహిరంగ సభలో తేలింది. అలాగే విధులు సక్రమంగా నిర్వర్తించని ముగ్గురు సిబ్బంది సస్పెండయ్యారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. అత్యధికంగా సి.కాలేపల్లి, గంగిరెడ్డిపల్లి పంచాయతీల్లో రూ.31 వేలు అవినీతి చోటు చేసుకోగా అత్యల్పంగా సి.రామాపురంలో రూ.946 అవినీతి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధి హామీలో అవకతవకల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సాంకేతిక సహాయకులు సుదర్శన్, బేర్‌ఫుట్ ఇంజనీర్ రమేష్, జూనియర్ ఇంజనీర్ మమతలను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు ఎంపీడీవో ఇందిరమ్మ, ఏపీడి టి చిన రెడ్డప్ప, డీఆర్‌డీఏ ఏపీడి ప్రభావతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి, ఏఈఈ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తూ అనంతలోకాలకు..

- ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుడు ఆంధ్రజ్యోతిలో ఏసీవో
- నాయుడుపేటలో విషాదం





ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు - మృతుడు రాజేంద్ర(ఫైల్)

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్)/నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం చేసుకున్నామన్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు. భోజనం కోసం ఓ హోటల్ వద్ద ఆగిన వారి కారును మరో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపం సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పూల రాజేంద్ర (41) ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ విభాగంలో (ఏసీవో) పని చేస్తున్నారు. తన నలుగురు స్నేహితులతో కలిసి కారులో నాయుడుపేట నుంచి శ్రీశైలంకు వెళ్లారు. అక్కడ దైవదర్శనం అనంతరం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో ఓ హోటల్ వద్ద సోమవారం రాత్రి భోజనం కోసం ఆగారు. ఇద్దరు కారులో నుంచి కిందకు దిగగా, మరో ముగ్గురు కారులోనే ఉన్నారు. అంతలో దుత్తలూరు వైపు నుంచి వేగంగా వెళ్తున్న మరో కారు ఢీకొంది. దీంతో కారులో ఉన్న రాజేంద్రతోపాటు చెందేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించగా, అప్పటికే రాజేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రఘునాథ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో సహా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా మంగళవారం రాజేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేంద్ర స్వస్థలం చిత్తూరు జిల్లా నింద్ర మండలం కావనూరు గ్రామం కావడంతో మృతదేహాన్ని ఆ గ్రామానికి తీసుకెళ్లారు. ఈ ఘటనతో నాయుడుపేట, కావనూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు రాజేంద్రకు భార్య రాధ, ఇంటర్, 9వ తరగతి చదువుతున్న కొడుకు దినేష్, కుమార్తె భవ్య ఉన్నారు.

విజ్ఞాన దర్పణం సంస్కృత భాష

- ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు
- భాషోత్సవ సదస్సులో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం



పుస్తకావిష్కరణలో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సంస్కృతభాషలో వైజ్ఞానికం దాగిఉందని ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు అన్నారు. రామసేతు, బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం తదితర నిర్మాణాలు సంస్కృతంలోని వైజ్ఞానికతని తెలియజేస్తాయన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన భాషోత్సవం జాతీయ సదస్సు ముగింపు, అక్షర పురుషోత్తమ మందిర ఆవిష్కరణ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామితో కలిసి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీలోని హెరిటేజ్ కారిడార్‌లో నిర్మించిన స్వామినారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ మందిరాన్ని వారు ఆవిష్కరించారు. జగన్నాథమందిరంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గవర్నరు, సీఎంలకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సభాకార్యక్రమంలో గవర్నరు హరిబాబు మాట్లాడుతూ..సంస్కృతభాష మానవ జీవనాన్ని నడిపించే లివింగ్ లెగసీ అన్నారు. తనస్వగ్రామం తిమ్మసముద్రంలో సంస్కృత ఓరియంటల్ కళాశాల ఉండేదని, అక్కడ సంస్కృతాన్ని చక్కగా బోధించేవారని గుర్తు చేసుకున్నారు. సంస్కృతంలోని పాణినీయ వ్యాకరణం నేటి కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, ఆధునిక ఏఐకి ఉపయోగకరమన్నారు.

సంస్కృతంలో భారతీయ జ్ఞానపరంపర

సీఎం పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. భారతీయ జ్ఞానపరంపర సంస్కృతభాషలోనే నిగూఢమై ఉందన్నారు. నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం, రాజనీతిశాస్త్రం తదితర సర్వవిధార్మికాంశాలు ఇందులోనే ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతభాషాభివృద్ధికి వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అధ్యాపకులను సాధు భద్రేశదాస్‌స్వామి చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి, శ్రీపరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.గణపతిభట్, థింక్ ఇండియా కౌన్సిల్ మెంబర్ సౌరవ్‌పాండే, కోఆర్డినేటర్ డాక్టర్ జ్ఞానరంజన్ పండా, ఉత్తరాఖండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కె.రుహెల్లా, డీన్లు, హెచ్‌వోడీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిసిటీ కోసమే ఇదంతా..



తిరుమల భద్రతలో భాగంగానే మఠాలకు నోటీసులు ఇచ్చారు. దీనిపై భక్తులకు రాని ఇబ్బందులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డికే వస్తున్నాయి. కేవలం పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారు. టీటీడీలో పారదర్శక పాలనతో శ్రీవారి భక్తులకు మేలు జరుగుతుంటే ఓర్వలేక భూమన విమర్శలు చేస్తున్నారు. కుంకీ ఏనుగలతో వైల్డ్ ఎలిఫెంట్ డ్రైవ్ జరుగుతోంది. దీనిపై బుర్రలేకుండా మాట్లాడుతున్న వైసీపీ నేతలను కూడా తరిమికొట్టాలి.

- జనసేన నేత కిరణ్‌రాయల్, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జైలే



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'తల్లిదండ్రులు, వయో వృద్ధుల సంరక్షణలో ఆయా కుటుంబాలు బాధ్యత వహించాలి. నిర్లక్ష్యం వహించే వారిపై వయోవృద్ధుల చట్ట ప్రకారం రెండు నెలల జైలు శిక్ష, లేదా రూ.5వేల జరిమానా విధిస్తారు' అని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై వివిధ శాఖ అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేని కారణంగా వివాదాలు తలెత్తుంటాయన్నారు. శ్రీమంతుల కుటుంబాల్లోనూ ఇలాంటి పరిస్థితులు చూస్తుంటామన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన నుంచి అతని ఆస్తి నుంచి తనుక తాను కాపాడుకోలేకపోయినపుడు ప్రాథమికంగా ఆర్డీవో అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆర్డీవో ద్వారా సదరు వ్యక్తులకు నోటీసులు అందించి విచారిస్తారన్నారు. అప్పటికీ సమస్య సామరస్యంగా పరిష్కారం కాకుంటే.. ఆ వ్యక్తులపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత అసోసియట్‌ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసంప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల వాఖ ఏడీ వినోద్, ఐసీడీఎస్‌ప పీడీ వసంత, పాస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌కు కరెంటు తీగలు తాకి డ్రైవరు మృతి



మృతి చెందిన చిరంజీవి

శ్రీకాళహస్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీకి కరెంటు తీగలు తాగడంతో విద్యుదాఘాతం సంభవించి డ్రైవరు చిరంజీవి(38) మృతి చెందారు. ఈ దుర్ఘటన మంగళవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని చెన్నై రహదారిపై భక్తకన్నప్ప కూడలి సమీపంలో చోటుచేసుకుంది. పిచ్చాటూరు మండలం కీలపూడికి చెందిన చిరంజీవి లారీ డ్రైవర్. ఈ క్రమంలో మంగళవారం రేణిగుంట నుంచి శ్రీసిటీకి కంటైనర్ లారీ తో బయలుదేరారు. భక్తకన్నప్ప కూడలి సమీపంలో లారీ వెళ్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగులుకున్నాయి. లారీ దిగేందుకు డోరు తాకగానే ఒకసారిగా చిరంజీవి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలారు. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు చిరంజీవి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.




రుయా సమీపంలో ఇలా | అమ్మలా అన్నం తినిపిస్తున్న సుజాత | మాటలకందని సేవ | ఆంధ్రజ్యోతిలో వార్తను చూస్తున్న అక్క అరుణ | అలిపిరి అనాథ స్నేహితుల వీడ్కోలు

మనసున్నోళ్ల మానవీయ స్పందన

తమ్ముడూ.. బేగొచ్చెయ్..!

- విజయనగరం ఎంపీ, తిరుపతి పోలీసుల సహకారంతో అక్క వద్దకు తరలివెళ్లిన నెల్లిమర్ల వాసి
- సామాజిక సేవకురాలు సుజాతకు ప్రశంసలు
- అక్కా తమ్ముళ్లను కలిపిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు



తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'తమ్ముడూ... బేగొచ్చెయ్..రా..' ఈ ఒక్క మాటతో ఆమె గొంతు పొలమారింది. దుఃఖం ఎగదన్నుకుని వచ్చింది. మొబైల్ ఫోన్‌లో తిరుపతిలోని అలిపిరి వద్ద రోడ్డు పక్కన ఉన్న తమ్ముడిని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చింది. వీడియో కాల్‌లో అక్కను చూస్తూ ఆ తమ్ముడూ దుఃఖసముద్రమే అయ్యాడు. 'అక్కా.. అక్కా..' అన్న మాట తప్ప మరేదీ అతని గొంతులోంచి పెగల్లేదు. ఆ అక్కా తమ్ముళ్ల దుఃఖం చూసినవారంతా కంట తడిపెట్టారు. తమ్ముడిని ఆ స్థితిలో చూడలేక, దుఃఖాన్ని ఆపుకోలేక ఆమె ఫోన్ కట్ చేసేసింది. కాసేపటికి మళ్లీ లైన్‌లోకి వచ్చి 'తమ్ముడూ నాకు చెప్పకుండా ఒక్కడివే తిరపతికి ఎందుకెల్లావ్..?' అని ఏడుస్తూనే కోప్పడింది. 'ఒక్క ఫోన్ చేసివుండొచ్చు కదా' అని నిష్ఠూరాలాడింది. 'నాకేదీ గ్యాపకం లేదక్కా.. నా బ్యాగు, పర్సూ కూడా లేవక్కా.. సుజాత అని ఒక తల్లి నాకు ప్రేణం పోసిందక్కా..' అంటూ అతనూ ఏడుస్తూనే వివరించాడు. తమ్ముడు పడ్డ బాధలు వినే శక్తి బహుశా ఆమెకు లేదేమో.. 'బేగొచ్చెయ్.. తమ్ముడూ.. ఇక ఎక్కడికీ వెళ్లద్దు.. నా దగ్గరే వుండిపోదూ..వచ్చెయ్' అంటూ ఫోన్ పెట్టేసింది.



రుయా నుంచి తరలిస్తున్న అలిపిరి సీఐ రామకిశోర్

నెల్లన్నర కిందట తిరుమలకు దర్శనానికి వచ్చి అన్నదాన సత్రం వద్ద కళ్లుతిరిగి పడిపోయిన హార్డ్‌వేర్ ఇంజనీర్ కోరుమల్లి వెంకట్రావు, కదల్లేని స్థితిలో అలిపిరి సమీపంలో రోడ్డుపక్కన పడి వుండిపోయిన తీరును ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. 'అక్కా.. వచ్చి నన్ను తీసుకుపో' అంటూ ప్రచురించిన వార్త అక్కా తమ్ముళ్లను చేరువ చేసింది. అలిపిరి అనాథలకు అమ్మలా సేవచేసే సుజాతకు వెంకట్రావు చెప్పిన వివరాల ఆధారంగా ఆంధ్రజ్యోతి నెల్లిమర్ల రిపోర్టర్ సారిపల్లిరోడ్డులోని బృందావన్ వ్యాలీలో విచారించగా అక్క అరుణా పాతక్ ఇల్లు దొరికింది. ఢిల్లీలో ఇంజనీర్లుగా పనిచేసి రిటైరైన ఆమె, ఆమె భర్త ప్రస్తుతం ఇక్కడ ఉంటున్నారు. వెంకట్రావు పెళ్లి చేసుకోలేదు. ఒక్కడే విశాఖపట్టణంలో ఉండేవాడు. నలుగురు అక్కచెల్లెళ్లను తరచూ వెళ్లి కలిసేవాడు. నెలన్నరగా అతని ఫోన్ పలకకపోవడంతో వారు ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని అనుకున్నారు. తిరుపతిలో మరుగుదొడ్ల పక్కన ఇటువంటి స్థితిలో ఉంటాడని వారు ఊహించలేదు. ఆంధ్రజ్యోతి సమాచారంతో, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందనతో ఇప్పుడు తమ్ముడి రాక కోసం నెల్లిమర్లలో ఎదురు చూస్తున్నారు.

కదిలించిన వార్త

ఆంధ్రజ్యోతి వార్తకు విజయనగరం ఎంపీతోపాటూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించారు. వివరాలు కనుక్కోమని డీఎస్పీ భక్తవత్సలాన్ని ఆదేశించారు. అలిపిరి సీఐ రామకిశోర్ రంగంలోకి దిగారు. సామాజిక సేవకురాలు సుజాత ద్వారా వెంకట్రావు ఉన్న ప్రదేశానికి ఉదయమే చేరుకున్నారు.వెంటనే రుయాస్పత్రికి తరలించారు.సుజాత అప్పటికే వెంకట్రావును శుభ్రం చేసి, ప్యాంటు చొక్కా వేశారు. వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. తన అక్క ఫోన్‌లో మాట్లాడిన తర్వాత వెంకట్రావులో చాలా మార్పు వచ్చింది. ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ఏర్పాటు చేసిన కారులో, ప్రసాద్ అనే కానిస్టేబుల్ సాయంతో మధ్యాహ్నం 2.20గంటలకు నెల్లిమర్లకు బయలుదేరారు.

నీ వల్లే బతికాను తల్లీ!



రుయాస్పత్రిలో నుంచి వెంకట్రావును బయటకు తీసుకువచ్చి కారులో ఎక్కిస్తున్న సమయంలో ఆయనకు నెలరోజులుగా అన్నం పెట్టి సేవ చేస్తున్న సుజాత కన్నీటి పర్యంతం అయ్యారు. ఆయన కూడా ఆమెను పట్టుకుని ఏడుస్తూ ఉండిపోయారు. 'నాయనా.. దారిలో ఏం తింటావో.. ఈ బిస్కెట్ తిను..' అంటూ ఆమె అతని నోటికి బిస్కెట్ అందించారు. 'నువ్వు నా తల్లివమ్మా.. నువ్వు లేకపోతే ఇక్కడ మిగిలేవాడిని కాదమ్మా' అంటూ వెంకట్రావు ఒక బిస్కెట్ తుంచి సుజాత నోట్లో పెట్టారు. ఆమెతో పాటూ ఇన్ని రోజులుగా అదే పేవ్‌మెంట్ మీద ఉంటున్న అనాథలు కొందరు కూడా వచ్చి ఆయనకు వీడ్కోలు చెప్పారు.



చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

చిత్తూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే ట్రూఅప్ పేరుతో మరో రూ.12771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడానికి తాము ఒప్పుకోమని చెప్పారు. 36 నెలల నుంచి రూ.3వేల కోట్ల ట్రూఅప్ చార్జీలు వసూలు చేశారన్నారు. గత ప్రభుత్వంలా విద్యుత్ భారం వేయబోమని, ఇంకా తగ్గిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాయని గుర్తుచేశారు. అలాగే స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఐ, సీపీఎం నాయకులు నాగరాజు, గంగరాజు, గోపీనాథ్, మణి, రమాదేవి, కోమల, రఘు, లత, గజేంద్రబాబు, దేవయాని, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'ను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో పీఎం సూర్యఘర్ పథకం అమలు, సౌరప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ విద్యాధరితో కలసి అధికారులకు పలు సూచనలిచ్చారు. పీఎం సూర్యఘర్‌కు పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాలో చేపట్టే సౌర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని చెప్పారు. కుప్పం డివిజన్‌లో ఫీడర్‌స్థాయి సోలరైజేషన్ మొత్తం సామర్థ్యం 141 ఎంవీ, 705 ఎకరాల భూమి అవసరమని అధికారులు తెల్పాలన్నారు. ఇప్పటికే 400 ఎకరాలను గుర్తించామని, నిర్మాణాన్ని మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్‌కు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, సీజీఎం రమాదేవి, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, రెస్కో ఎండీ సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌ఎంటీలు బోధనపై పట్టు సాధించాలి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్(సీఆర్‌ఎంటీ)లు బోధనపై పట్టు సాధించాలని సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక బాలాజీ కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో 31 మండలాల్లోని 153 మంది సీఆర్‌ఎంటీలతో సమీక్షించారు. టీచర్స్ హ్యాండ్ బుక్ వ్యాల్యూ ఎడ్యుకేషన్, లీ యాప్‌లోని సమ్మరీ వీడియోస్ యాక్షన్ రీసెర్చ్ ట్రైనింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థుల నమోదు, బడిబయటి పిల్లల నమోదు, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్‌పైనా చర్చించారు. ఎస్ఆర్‌పేట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రమేష్, డీసీఈబీ సెక్రటరీ హేమాద్రి, సెక్టోరియల్స్ పాల్గొన్నారు.

భార్యతో పురుగుమందు తాగించాడు!



బాధితురాలు సోని

బంగారుపాళ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భార్యతో పురుగుల మందు తాగించిన ఘటన బంగారుపాళ్యం మండలంలో జరిగింది. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం పాలేరు పంచాయతీ మోతకుంటకు చెందిన రెడ్డెప్ప కుమారుడు రాజేష్‌కు సోనీతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. రాజేష్ తాగుడుకు బానిసై తరచూ దొంగతనాలకు పాల్పడేవాడు. మరోవైపు భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జరిగిన గొడవలో భార్యను కొట్టాడు. భయపడిన ఆమె మోతకుంట నుంచి పారిపోయింది. అయినా తన తమ్ముడు సందీప్‌తో కలిసి ఆమెను వెతికి పట్టుకొచ్చి పురుగుల మందును బలవంతంగా తాగించాడు. కుటుంబీకులు గమనించి బాధితురాలిని బంగారుపాళ్యం ప్రభుత్వం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో రాజేష్, సందీప్‌లపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం సీఐ తెలిపారు.

మొగిలీశ్వరాలయంలో హుండీ ఘటనపై విచారణ

బంగారుపాళ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలీశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది మే నెలలో జరిగిన హుండీ లెక్కింపు సందర్భంగా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమన్‌ప్రియపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం విచారణ జరిగింది. సుమన్ ప్రియతో పాటు ఆమెపై ఫిర్యాదు చేసిన ప్రసాద్‌ను అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. కర్నూల్ ఎండోమెంట్ కార్యాలయానికి నివేదికను పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎంబీ కుమార్‌రాజా, ఈవో మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల కుటుంబాల్లో ధైర్యం నింపుదాం

- ఎస్పీ మణికంఠ పిలుపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అత్యాచార, పోక్సో బాధితుల కుటుంబాల్లో ధైర్యం నింపుదామని ఎస్పీ మణికంఠ పిలుపునిచ్చారు. ఇది మనందరి నైతిక బాధ్యత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మిషన్ వాత్సల్య పథకం కింద జరిగిన పిల్లల సంరక్షణ, సంక్షేమ కమిటీ సమావేశానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల కారణంగా జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 - 10 శాతం మధ్య చైల్డ్ ప్రెగ్నెన్సీ కేసులతోపాటు అబార్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమం ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. చైల్డ్ లేబర్, భిక్షాటన చేస్తున్న పిల్లలను వారి తల్లిదండ్రులవద్దకు చేర్చాలన్నారు.

కష్టాలు దాటి ముందడుగు వేయండి: కలెక్టర్

'తల్లిదండ్రులను కోల్పోయిన లోటు తీర్చలేనిది. అయినా కష్టాలను దాటి ముందడుగు వస్తే భవిష్యత్తు బాగుంటుంది' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మిషన్ వాత్సల్యలో భాగంగా బాధితులు, వారి సంరక్షకులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన 21 మంది పిల్లలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉందన్నారు. ఒక్కొక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.20లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి పిల్లల ఆరోగ్యం, విద్య, వైద్యం తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం కూడా శ్రద్ధ తీసుకుంటుందని స్పష్టం చేశారు. అనంతరం 21 మంది పిల్లలకు ప్రభుత్వం ద్వారా నగదు జమచేసిన పాసుపుస్తకాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, జడ్పీసీఈవో రవికుమార్, డీఈవో వరలక్ష్మి, ఇతరశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ మణికంఠ, పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్

గత పాలకుల్లా వ్యవహరించొద్దు

- సమస్యల పరిష్కారానికే వినూత్న కార్యక్రమం
- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య



కార్యక్రమానికి హాజరైన ఉద్యోగ సంఘాల నేతలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల్లా వ్యవహరించొద్దని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుతో మంగళవారం కలెక్టరేట్‌లోని క్యాంటీన్ ఆవరణంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో మొండి బకాయిలను విడుదల చేయాలని ధర్నా చేసిన ఉద్యోగ సంఘ నేతలపై కేసులు పెట్టి వేధించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అలా చేయకూడదని కోరుకుంటున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఐదేళ్లలో రిటైర్‌మెంట్ అయినవారికి ఇంకా బెనిఫిట్స్ అందలేదని, వారంతా కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు రూ.25వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. జిల్లా కేంద్రాలు, మండల పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాల రూపంలో ఉద్యోగులకు ఇస్తే ఈ బకాయిలను చెల్లించినట్లవుతుందన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసమే నూతన కార్యక్రమం చేపట్టామని, ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఇలా చేయడం లేదని స్పష్టం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్‌బాబు, కోశాధికారి దేవకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు టీడీపీ మండలాధ్యక్ష పదవులపై పీటముడి

- ఎటూ తేల్చలేకపోయిన ఎమ్మెల్యే, పరిశీలకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

చిత్తూరు సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ అధ్యక్ష పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది.చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జీడీ నెల్లూరు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. గంగాధరనెల్లూరు, పెనుమూరు, ఎస్ఆర్ పురం, కార్వేటి నగరం, పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల నుంచి నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఎమ్మెల్యే థామస్,పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, రమణారెడ్డి, గురవారెడ్డి సమక్షంలోనే మండల అధ్యక్ష పదవికోసం నేతలు వాగ్వాదానికి దిగడంతో పోలీసుల సమక్షంలో సమావేశాన్ని నిర్వహించాల్సి వచ్చింది.టీడీపీ అధికారంలో వుండడంతో పార్టీ పదవులకోసం పోటీ తీవ్రంగా ఉంది. మంగళవారం రాత్రి 10గంటలదాకా సమావేశం జరిగినప్పటికీ వెదురుకుప్పం, జీడీ నెల్లూరు మండలాల అధ్యక్ష పదవులకు నేతలను ఎంపిక చేయలేకపోయారు. మిగిలిన మండలాల అధ్యక్షుల విషయంలో ఏకాభిప్రాయం వచ్చినప్పటికీ వాటిని కూడా ప్రకటించకుండా ఆశావహుల పేర్లను అధిష్ఠానానికి పంపనున్నట్లు ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకులు ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం మండలాధ్యక్షుల పేర్లను ఎంపికచేసి ప్రకటిస్తుందా లేక ఐవీఆర్ఎస్ ద్వారా నియోజకవర్గ కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరించి నిర్ణయిస్తుందా తెలియాల్సి ఉంది.



జీడీ నెల్లూరు మండల అధ్యక్ష పదవి కోసం దేవసుందరం, స్వామిదాస్ వాగ్వాదం

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ కార్మికులు

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం వేతనాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు ప్రసాద్‌రాజ, చిన్ని, మురుగేష్, రాజేష్, వెంకటేష్, జీవా, షహరా భాను, భార్గవి, తులసి పాల్గొన్నారు.

● పలమనేరు టీడీపీ కార్యాలయంలోబైరెడ్డిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా నియమితులైన నాగరాజు, డైరెక్టర్లుగా నియమితులైన దివాకర్‌రెడ్డి, విశ్వనాథ గౌడు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి టీడీపీ మండలాధ్యక్షులు కిషోర్‌గౌడ్, సుబ్రహ్మణ్యం శెట్టి, రఘుచంద్రగుప్తా, భువనచంద్రగౌడు, గోవిందస్వామి, శేషు, మంజునాథ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



కేడీసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

డిగ్రీ మొదటి సెమిస్టర్‌లో కేఈసీ ప్రభంజనం

కుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మంగళవారం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు కళాశాల ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ తెలిపారు. బీకామ్ (సీఏ)లో ఎస్.హరీశ్ 9.35 పాయింట్లు, బీసీఏలో ఎస్.ప్రియాంక, ఎస్.భావన 9.5 పాయింట్లు, బీఎస్సీలో జి.పూర్ణిమ 8.45 పాయింట్లు, బీబీఏలో ఎం.సింధు 8.4 పాయింట్లు, బీఎస్సీ (కెమిస్ట్రీ)లో ఎం.పళణి 6.80 పాయింట్లు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డి.సుధారాణి అభినందించారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు



సూపరింటెండెంట్ మమతారాణితో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో త్వరలోనే కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వీణాకుమారి తెలిపారు. ఆస్పత్రిలో ఇటీవల ఆక్సిజన్ పైపులైన్ పనులు పూర్తిచేసిన సందర్భంగా ఎమ్మెల్యేను మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కలిశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి గురించి చర్చించారు. ఆస్పత్రిలో లిఫ్ట్, క్యాంటీన్ ఏర్పాటుపై మాట్లాడారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నాగరాజు, సభ్యులు సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



క్యాడెట్లతో ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఎన్‌సీసీ అధికారి బాలాజీ

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగిన బీ, సీ సర్టిఫికెట్ల పరీక్షలకు నిర్వహించిన ప్రాక్టికల్స్, రాత పరీక్షల్లో 87 మంది క్యాడెట్లు పాల్గొని వందశాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన క్యాడెట్లకు ఎన్‌సీసీ అధికారి టి.బాలాజీ, 35 ఆంధ్రబెటాలియన్ పీఐస్టాఫ్ వెట్రియన్‌లతో కలిసి సర్టిఫికెట్లను అందించారు. ఎన్‌సీసీ అధికారి బాలాజీని ప్రిన్సిపాల్ అభినందించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

రొంపిచెర్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంటలకు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని పుంగనూరు డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ శివ కుమార్ అన్నారు. సోమవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బండకిందపల్లె రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ సాగుపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ క్రాప్ చేసుకున్న రైతులు పథకాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం రాయితీపై రసాయన ఎరువులు అందిస్తోందని తెలిపారు. ఏవో శ్రావణి, ఏఈవోలు సుబ్రహ్మణ్యం, హేమలత పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యసేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఆశాకార్యకర్తలు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయచందర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాకార్యకర్తల బాధ్యతలు, చేపట్టాల్సిన పనుల పై వైద్యాధికారి వివరించారు. ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణలో ఆశాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాల నియంత్రణలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని పులిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల వివరాలు నమోదు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని సూచించారు. సిబ్బంది శ్రీదేవి, ప్రమీల, పురుషోత్తం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్తు అంతరాయాలు

కుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ విజ్ఞప్తి మేరకు 220 కేవీ విద్యుత్తు లైన్ షిఫ్టింగ్ చేస్తున్నట్లు రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. దానికి అనుబంధంగా కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లో అన్ని 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్లలోని ఫీడర్ల 3 ఫేస్ టైం తాత్కాలికంగా రీ షెడ్యూల్ చేసినట్లు చెప్పారు. దీంతో కుప్పం నియోజకవర్గంలోని 4 మండలాలలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు గ్రూప్-ఏ లో ఉదయం 4 నుంచి 11 గంటల వరకు, గ్రూప్-బి లో ఉదయం 11 నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు, గ్రూప్ సీలో రాత్రి 9 నుంచి ఉదయం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అంతేకాక కొన్ని అత్యవసర సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● **పలమనేరు:** పలమనేరు, వి.కోట పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతు పనులు జరుగుతున్నాయని పలమనేరు ఏడీఈ వి.జీవన్‌కుమార్ తెలిపారు. దీంతో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ ఫీడర్లకు గ్రూప్-ఎలో ఉదయం 4 నుంచి 9 వరకు, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు, గ్రూప్-బిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు, గ్రూప్ సిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 11 నుంచి ఉదయం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

రామకుప్పంలో వాన



వానతో జలమయమైన వీధి

రామకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో గత రెండు రోజులుగా మధ్యాహ్నం వేళ ఓ మోస్తారు వానలు కురిశాయి. రెండు రోజుల క్రితం వరకు మండలంలో ఎండలు మండువేసవిని తలపించాయి. దీంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. అంతేకాకుండా వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా వాన చినుకు జాడ లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నింపింది. వేసవిలో ఎండలు మండి చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఎండిపోయాయి. దీంతో వ్యవసాయ బోర్లలో జలాలు అడుగంటడం ప్రారంభమైంది. వానలు మొహం చాటేస్తే భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తుతుందని వారు ఆందోళనకు గురయ్యారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వానలు సామాన్య జనంతో పాటు రైతులకు ఊరటనిస్తోంది. ఈ వానలు ఇలాగే కొనసాగితే ఖరీఫ్ సాగుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని రైతులు, తాగునీటి సమస్య నుంచి బయటపడొచ్చని జనం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం పలమనేరులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు ఆర్డీవో కార్యాలయంలోని డీటీ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు నివేశస్థలాల మంజూరు, పొరుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ఇస్తున్న సౌకర్యాలను వర్తింప జేయాలని కోరారు.

● **సదుం:** వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ పుంగనూరు శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులందరూ తగిన ధ్రువపత్రాలతో చిత్తూరు కార్యాలయంలోనూ, మరిన్ని వివరాలకు సంఘ కోశాధికారి కృపానందరెడ్డిని సంప్రదించాలని తెలిపింది.

అమరనాథరెడ్డిని కలిసిన బైరెడ్డిపల్లె సింగిల్‌విండో కార్యవర్గం



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె సింగిల్‌విండోకు నూతనంగా నియమితులైన కార్యవర్గం మంగళవారం పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో ఛైర్మన్ నాగరాజు, సభ్యులు దివాకర్‌రెడ్డి, విశ్వనాథ్‌గౌడు ఎమ్మెల్యేకు శాలువాకప్పి గజమాలతో సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి పాల్గొన్నారు.

కుంకీ ఏనుగుల కోసం వినతి

సోమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల గుంపు దాడులతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని.. కుంకీ ఏనుగులు మండలానికి రప్పించాలని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం రాయల్ కోరారు. మంగళవారం సోమలలో మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు అటవీ ప్రాంతంలో కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జిల్లా అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సోమల మండలంలో గత పదేళ్లుగా ఏనుగుల దాడులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కుంకీ ఏనుగులను రప్పించడానికి అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కైవారం మురళీ, రామకృష్ణ, అభిషేక్, సోమశేఖర్, రఘు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



పుంగనూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలు ఇలా.. మండలంలోని ఏతూరు పంచాయతీ కొత్తపల్లెకు చెందిన చిరంజీవి మూడు పాడిఆవులతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి వర్షం కురవడంతో మంగళవారం ఉదయం యథావిధిగా పశువులను మేతకు వదలడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్దకు ఆవులు వెళ్లగానే షాక్‌కు గురయ్యాయి. దీంతో ఓ పాడిఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మరో రెండు ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. ఆవు మృతితో సుమారు రూ.60 వేలు నష్టపోయానని బాధితుడు వాపోయాడు.

శిశువులకు తల్లిపాలే అమృతం

గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సులు



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రూప్‌కుమార్ తదితరులు



రొంపిచెర్ల: గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీవో వాణిశ్రీదేవి



సదుం: ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శిశువులందరికీ తల్లిపాలు అమృతతుల్యమైనవని పీఈఎస్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు రూప్ కుమార్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం నాటారు వీధిలోని అంగాళ పరమేశ్వరీ దేవాలయం ఆవరణలో మంగళవారం ప్రపంచ తల్లిపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైనవన్నారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యవంతంగా ఉండేందుకు జీవితకాలం టీకాగా పరిగణించాలని సూచించారు. తల్లిపాలు పట్టడంతో శారీరక, మానసిక ఎదుగుదల సవ్యంగా ఉంటుందని, బిడ్డ జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు శిశువులకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. తేనె, గ్లూకోజ్ నీరు, జంతువుల పాలు, బయట విక్రయించే పాలు, పాల పొడుల వంటివాటివల్ల శిశువు ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్‌పర్సన్ మహేశ్, కుప్పం లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ సెల్వం, కోశాధికారి లెనిన్ బాబు, డైరెక్టర్లు సెంథిల్ కుమార్, శివ, జయరాం నాయుడు, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల లియో క్లబ్ కో ఆర్డినేటర్లు మాధవన్, గంగాధర్, స్థానిక నాయకులు తిరుమగళ్, మునెప్ప, ప్రకాశ్, సురేశ్, కుమార్, పీఈఎస్ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

● **సదుం:** స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి ప్రసాద్ రాజు, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు. చెరుకువారిపల్లెలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

● **రొంపిచెర్ల :** బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని పులిచెర్ల సీడీపీవో వాణిశ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని బండకిందపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. సూపర్‌వైజర్ శిరీష, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పలమనేరు : భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల



పుంగనూరులో చౌకదుకాణాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని.. రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల సూచించారు. మంగళవారం పలమనేరులోని బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గదులు, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పౌరసరఫరాల గోదామును తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీసీవో పద్మజ పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** పుంగనూరులోని అన్ని వసతిగృహాలను ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజమాల దేవి తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్, బీసీ బాలుర హాస్టల్, తూర్పు మొగసాల రేషన్‌షాపు నంబర్ 15, నక్కబండలోని కస్తూర్బా పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వసతులపై ఆరా తీశారు. ఆమె వెంట డీఎస్వో శ్రీనివాసులు, తహసీల్దార్ రాము, డీటీ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ పణికుమార్, ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, ఏఎస్‌డబ్ల్యూవో శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **గంగవరం, పెద్దపంజాణి:** రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజమాల మంగళవారం గంగవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న సిబ్బంది, సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గంగవరం వైద్యాధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ పాల్గొన్నారు. పెద్దపంజాణి మండలంలోని బసవరాజుకండ్రిగ చౌకదుకాణాన్ని తనిఖీ చేశారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



పలమనేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : పలమనేరు పట్టణ ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా భరత్, కార్యదర్శిగా శిరీష, ఉపాధ్యక్షులుగా మౌనిక, వరలక్ష్మి, రాఘవేంద్ర, సహాయ కార్యదర్శిగా జుబియా, కన్వీనర్‌గా సమీనా, కో కన్వీనర్‌గా జాస్మిన్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర సమితి సభ్యులు మున్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను వెంటనే రద్దుచేయాలని ఆయన డిమాండు చేశారు. పేద విద్యార్థులకు పీజీ విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

పలమనేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎంపీపీ పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు మంగళవారం నోటుపుస్తకాలను వితరణగా అందజేశారు. దాతకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని పేద విద్యార్థులకు దాతలు ముందుకొచ్చి ప్రోత్సాహకాలు అందివ్వాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు

సోమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు విరాళాలు అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కోశాధికారి ఎన్.మునివెంకటప్ప, జ్యోతీశ్వరుడు తెలిపారు. పొదలకుంటపల్లెకు చెందిన సుంకర వందన, ప్రకాశ్ దంపతులు రూ.1,05,116, నడింపల్లెకు చెందిన విశ్రాంత టీచర్ జనార్దన్ , ప్రేమకుమారి రూ.10 వేలు, దిడ్డివారిపల్లెకు చెందిన విశ్రాంత హెచ్ఎం. దాసరి వెంకటరమణ, టీచర్ దేవిక దంపతులు రూ.10 వేలు విరాళం అందజేయడంతో కమిటీ కార్యదర్శి ఎస్‌వీ.రమణ, కమిటీ సభ్యులు వీరిని అభినందించారు.

'మనమిత్ర'పై అవగాహన అవసరం



పుంగనూరులో అవగాహన ర్యాలీ

పుంగనూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న మనమిత్రపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ డీఈఈ మహేశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



● **సోమల:** కందూరు సచివాలయ సిబ్బంది వాట్సాప్ గవర్నన్స్ పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జయశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ప్రభుత్వ సేవలను పొందడానికి కార్యాలయాలకు వెళ్లకుండానే వాట్సాప్‌లో సమాచారం పంపొచ్చని వివరించారు. వీఆర్వో సురేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మంపై యువత చైతన్యం కావాలి



రామాలయంలో భక్తులతో కమలానంద భారతి

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంపై హిందూ యువత చైతన్యం కావాలని గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు కమలానంద భారతిస్వామి తెలిపారు. సనాతన హైందవ ధర్మ పరిరక్షణ, హిందూ దేవాలయాల రక్షణక కమలానంద భారతి స్వామి తలపెట్టిన దేవాలయాల సంకల్పయాత్రతో భాగంగా రెండోరోజు మంగళవారం పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, రాయవారిపల్లి, పోశంవారిపల్లి, కావేటిగారిపల్లి పంచాయతీల్లో కొనసాగింది. యాత్రలో హిందువులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా విద్యార్థుల ప్రతిభ

గంగవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫలితాలలో మదర్‌థెరీసా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. బీసీఏలో యస్.ఆఫీఫా అంజుమ్(9.55), కె.సత్య (9.50), ఎన్‌బీ సుహితశ్రీ (9.45), పూర్ణిమ (9.40), రమ్యశ్రీ (9.30), గీష్మ (9.30), జయకృష్ణ (9.25), దీపిక (9.25), పల్లవి(9.15), చందన (9.15), బీబీఏ లో సారాఫాతిమా (9.55), ఆయేషాబాను (9), బీకామ్‌లో జాహ్నవి(9.35), యస్.పావని(9.10), సుస్మిత (9.05), సురేఖ (9.05), ప్రదీప(9.00), బీఎస్సీలో శ్రీవల్లిక (8.35), గౌతమి (8.30) పాయింట్లు సాధించారన్నారు. విద్యార్థుల ప్రగతికి కృషిచేసిన ప్రిన్సిపాల్ మధుసూదనరావు, అధ్యాపకులను ఛైర్మన్ సునీల్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డిలు అభినందించారు.

నిరుపేద కుటుంబాలను గుర్తించాలి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న డ్వామా పీడీ రవికుమార్

పుంగనూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలను గుర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. మంగళవారం పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో డ్వామా పీడీ రవికుమార్, మండల ఎంపీడీవో లీలామాధవిలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

11న బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

పుంగనూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగే బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు కోరారు. మంగళవారం పుంగనూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎగువపల్లెకు చేరుకున్న పాలేటమ్మ

సోమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మ ఆలయంలో జాతర ముగియడంతో అమ్మవారి ఉత్సవమూర్తిని మంగళవారం కోలాహలంగా ఎగువపల్లెకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్థానిక రామాలయంలో నవధాన్యాల నడుమ భద్రపరిచారు. పలు గ్రామాల భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త నరసింహులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నగరంలో మోస్తరు వాన



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వాన కురిసింది. వీధులన్నీ జలమయం అయ్యాయి. కాలువల్లోని మురుగు రోడ్లపైకి చేరింది. దీనివల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హోంమంత్రి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కుటుంబీకులతో కలిసి కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ మంగళవారం వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. వీరిని ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే మురళీమోహన్ మర్యాదపూరకంగా కలసి సత్కరించారు. ఆలయ ఈవో పెంచలకిషోర్ స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పరదేశి, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, స్థానిక నాయకులు మధుసూదనరావు, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి సన్మానం



శ్రీరంగరాజపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి టీడీపీ ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి రఘునాథరెడ్డిని చిత్తూరు భాస్కర హోటల్‌లో టీడీపీ నాయకులు మంగళవారం సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు నిరంజన్‌రెడ్డి, పుల్లూరు బాబు, సతీష్, జీవన్‌బాబు, జీవన్ కుమార్, పైనేని ధనంజేయులు, నోమేశ్వర్‌రెడ్డి, అముల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి పథకాలపై విచారణ



పథకాల అమలుపై ప్రజలు, ఉద్యోగులతో చర్చిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా మంజూరైన పథకాల అమలుపై మంగళవారం కార్వేటినగరం మండలం అన్నూరు గ్రామ పంచాయతీలో జాతీయ పథకాల పర్యవేక్షణ బృందం(ఎన్ఎల్ఎం) విచారించింది. ఇందులో డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ మణికంఠ, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున్, ఏపీడీ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మంజూరైన పథకాలు సక్రమంగా అర్హులకు అందుతున్నాయా.. ఏదైనా జాప్యం జరుగుతోందా.. అని అన్నూరువాసులతో ముఖాముఖి మాట్లాడి, తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఎం కవిత, ఉద్యోగులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- జేసీకి మీడియా సంఘాల వినతి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని జేసీ విద్యాధరికి జర్నలిస్టులు వినతిపత్రమిచ్చారు. జర్నలిస్టుల డిమాండ్స్ డేలో భాగంగా చిత్తూరు ప్రెస్‌క్లబ్, జిల్లా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీని కలిశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఆరోగ్య, ప్రమాదబీమా వర్తింపజేయాలని, విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్‌స్కీమ్ అమలుచేయాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నియంత్రణకు కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని విన్నవించారు.

కూలేందుకు సిద్ధంగా మంచినీటి ట్యాంకు



యాదమరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లెలోని మంచినీటి ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికులు తెలిపారు. దీన్ని సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించారు. పదేళ్లుగా ఈ ట్యాంకు నిరుపయోగంగా ఉందని, కొత్తది నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం మంచినీటిని బోరు నుంచి డైరెక్ట్‌గా పంపింగ్ చేస్తున్నారని తెలిపారు. పైపులైన్లు పాతబడడంతో లీకేజీలు ఎక్కువగా ఉంటూ నీరు వృథా అవుతోందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నగరి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి మండలం నాగరాజకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీకాళహస్తిలో జరిగిన పోటీల్లో పదో తరగతి చదివే నికాస్, జ్యోత్స్న, తొమ్మిదో తరగతి చదివే విమల్‌లు ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని మంగళవారం హెచ్ఎం పద్మనాభరాజు, పీడీ గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటినుంచి వేణుగోపాలుడి తెప్పోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు బుధవారం నుంచి మూడ్రోజులపాటు జరుగుతాయని ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. స్కంద పుష్కరిణిలో తొలి రోజున సాయంత్రం 6.30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కోదండ రామస్వామి అలంకరణలో స్వామివారు ఐదు చుట్లు, వేణుగోపాలస్వామిగా గురువారం ఏడు చుట్లు, శుక్రవారం తొమ్మి చుట్లు విహరిస్తారని వివరించారు.

8న వరమహాలక్ష్మీవ్రతం: వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఈనెల 8వ తేదీన వరమహాలక్ష్మీవ్రతం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని ఆలయన ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ తెలిపారు. ఈ వ్రతంలో రూ.500 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

అడవి కాదు.. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం



వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇదెక్కడో అడవి ప్రాంతం అనుకునేరు. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వెలుగు కార్యాలయాల ఆవరణ వెనుక భాగం. ఇక్కడే ఓ వాటర్ ట్యాంకు కూడా నిరుపయోగంగా మారిపోయింది. ఈ మార్గంలోనే కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలి. ఈ సముదాయంలోనే అన్నిశాఖల కార్యాలయాలు ఉండటం కొసమెరుపు. ఇప్పటికైనా ఇక్కడ శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది.

ప్రజల సానుభూతి కోసం

జగన్‌రెడ్డి పాకులాట

తెలుగు యువత విమర్శ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ లిక్కర్ స్కాం ప్రజల్లోకి చేరడంతో ఆ పార్టీలోని నేతలందరు జైలుకు వెళ్లడాన్ని జీర్ణించుకోలేక సానుభూతి పొందేందుకు మాజీ సీఎం జగన్‌రెడ్డి పాకులాడుతున్నారని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో దోచుకో.. దాచుకో అన్న చందంగా పాలన సాగించారే తప్ప ప్రజలకు, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఏవిధంగా ఉపయోగపడ లేదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంత చెత్తగానా..?

గొల్లకండ్రిగలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం దుస్థితి





అపరిశుభ్రంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిసరాలు



వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గొల్లకండ్రిగ వద్ద ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ దారుణంగా ఉంది. ఈ కేంద్రంలో పిచ్చిమొక్కలు మొలిచి, పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయి. ఎంత చెత్త సేకరణ కేంద్రమైనా ఇలా వదిలేస్తారా? అని స్థానికులు విస్తుపోతున్నారు.

సర్వేని అడ్డుకుని దూషించారు

పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్వేయర్లు, వీఆర్వో



సర్వేను అడ్డుకుంటున్న మహిళలు (ఫైల్ ఫొటో)

యాదమరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సర్వే చేయడానికి వెళ్లిన తమను అడ్డుకుని, దుర్భాషలాడారని మండల, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని దాసరాపల్లె దళితవాడలో రాజాకు చెందిన ఇంటి నిర్మాణ పనులను అదే గ్రామానికి చెందిన ఎస్తర్, చంద్రశేఖర్ దంపతులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో సర్వే చేసి తన స్థలాన్ని చూపించాలని తహసీల్దార్‌కు రాజా విన్నవించుకున్నాడు. దాంతో సోమవారం మధ్యాహ్నం పోలీసులతో కలిసి మండల సర్వేయర్ తులసీధర్, స్థానిక సచివాలయ సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో సురేష్ దాసరాపల్లె దళితవాడకు వెళ్లారు. సర్వే చేయబోతుండగా ప్రభుత్వ సిబ్బందిని దూషించి, పనులను అడ్డుకుని, పరికరాలను ధ్వంసం చేశారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, దూషించడం, దౌర్జన్యానికి పాల్పడటంపై జోస్పిస్, సోమశేఖర్, ఎస్తర్, కారుణ్య, డేనియల్, రజీనా, సోనియాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సర్వేయర్లు, వీఆర్వో కోరారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు యాదమరి ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు.

దేశమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే



సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాశ్

నగరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని టీఆర్‌కండ్రిగలో ఉన్న దేశమ్మ దేవాలయ ఆడిమాస ఉత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారికి సారెను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సమర్పించారు. అనంతరం కోలాట భజనను ఎమ్మెల్యే తిలకించి, కళాకారులతో ముచ్చటించారు. ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు మదన్, వెంకటాచలం, మణిరెడ్డి, నాయకులు గుణశేఖర్, జ్యోతినాయుడు, రమేష్‌బాబు, బాలాజి, జవహర్‌రెడ్డి, శ్రీనివాసన్, కృష్ణారెడ్డి ఎంపీ బాబు, శేఖర్, ఎంపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్ణాటక హోంమంత్రికి సత్కారం

బంగారుపాళ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్‌ను చిత్తూరు జిల్లా ఈడిగ సంఘ గౌరవాధ్యక్షుడు గోపిగౌడ్, సభ్యులు సత్కరించారు. మంగళవారం ఆయన కాణిపాకం వెళుతూ బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్త కృష్ణప్ప ఆర్కే ఫామ్ హౌస్‌కు రాగా సంఘ నేతలు కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈడిగ బీసీ సంక్షేమ అధ్యక్షుడు బుసా నాగరాజ గౌడ్, ప్రధాన కార్యదర్శి మురళీగౌడ్, రాష్ట్ర మాజీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ అట్లూరు ఎల్లప్పగౌడ్, శంకర్‌గౌడ్, రమేష్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

నీవానది బ్రిడ్జిపై లైట్లు ఏర్పాటు చేయండి



గంగాధరనెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు వద్ద చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారిలో ఉన్న నీవానది ఏటిపై సుమారు 20 ఏళ్లకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జికి ఇరువైపులా లైట్లు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఏదైనా జరిగితే పరిస్థితి దారుణంగా తయారవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఇక్కడ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావించినా ఎందుకనో కార్యరూపం దాల్చలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిపై లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్పీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాయల్ పీపుల్ ఫ్రంట్ (ఆర్పీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు వెదురుకుప్పం మండలం కండ్రిగకు చెందిన జీకే నాగరాజురాయల్ ఓ ప్రకటనలో తెలిపారు. బలిజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 170 గొల్లపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత చలగుండ్లపల్లె బాబునాయుడు(65) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, ఎన్పీ జయచంద్రనాయుడు, ఎన్పీ సురేంద్ర నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షుడు వెంకటేశ్వరచౌదరి, కోకాప్రకాష్‌నాయుడు మంగళవారం ఆయన మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

పుంగనూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి చెందింది. పుంగనూరు మండలంలోని ఏతూరు పంచాయతీ కొత్తపల్లెకు చెందిన చిరంజీవి మూడు పాడిఆవులతో జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా విద్యుత్ ట్రాన్స్‌ఫారం మరమ్మతులకు గురికావడంతో ఆశాఖ అధికారులకు సమచారం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే సోమవారం రాత్రి వర్షం కురవడంతో మంగళవారం ఉదయం యథావిధిగా పశువులను మేతకు వదలడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పారం వద్దకు ఆవులు వెళ్లగానే షాక్‌కు గురయ్యాయి. దీంతో ఓ పాడిఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మరో రెండు ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. ఆవు మృతితో సుమారు రూ.60వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజనం రుచి చూస్తున్న రాష్ట్ర ఆహార పరిశీలన కమిటీ సభ్యురాలు దేవి

బంగారుపాళ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని రాష్ట్ర ఆహార పరిశీలన కమిటీ సభ్యురాలు దేవి సూచించారు. మంగళవారం మహాసముద్రం,గుండ్లకట్టమంచి, తిమ్మోజుపల్లె, మండల కేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ పాఠశాలల్లో తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి, పలు సూచనలిచ్చారు. ఎంఈవో-2 రమేష్ బాబు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాగా, తలనీలాల వేలం పాట ద్వారా రూ.1.27 లక్షల ఆదాయం ఆలయానికి వచ్చిందని ఈవో కృష్ణనాయక్ తెలిపారు.

- కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మకు కూడా పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

వర్షంతో వేరుశనగ రైతులకు ఊరట

పాలసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి గంటపాటు కురిసిన వర్షంతో వేరుశనగ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటకు అనుకూలంగా మారిందని చెబుతున్నారు. అలాగే చెరకు, అరటి తోటలకు ఈ వర్షం మంచిదన్నారు.

అంతిమ సంస్కారం చేయడమెలా?



గొల్లకండ్రిగ వైకుంఠ మహా ప్రస్థానం దుస్థితి

వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గొల్లకండ్రిగ వద్ద ఉన్న వైకుంఠ మహాప్రస్థానం వద్ద ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఎవరైనా చనిపోతే ఇక్కడికి తీసుకొచ్చి అంతిమ సంస్కారం చేయడానికి ఇబ్బందిగా తయారైంది. ఈ నేపథ్యంలో తమ వ్యవసాయ భూముల వద్దే ఖననం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఇక్కడ పిచ్చిమొక్కలు తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



ఇరువైపులా కోతకు గురైన రోడ్డు

పెనుమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి నేంద్రగుంట వెళ్లే మార్గంలోని రోడ్డుపై ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్‌రోడ్డు కావడంతో ఈ మార్గంలో పెద్ద వాహనం వస్తే ఎదురుగా వస్తున్న వాహనాలు ఇబ్బందులు పడాల్సిందే. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పైగా అనేక మలుపులు, రోడ్డుకిరువైపులా కోతలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారి విస్తరణ కోసం చాలా ఏళ్లుగా ప్రతిపాదనలు, సర్వేలు చేస్తున్నారే తప్ప పనులు మాత్రం ప్రారంభించట్లేదు. ఇకనైనా ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

అభినందన



విజయపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కోసలనగరం, అగరం రామకృష్ణా సింగిల్‌విండో చైర్మన్లు బాబుయాదవ్, బాబునాయుడు తిరుపతిలో మంగళవారం కలిశారు. ఉత్తమ పీఏసీఎస్‌గా కోసలనగరం ఎంపిక కావడంతో చైర్మన్‌తోపాటు సీఈవో చంద్రమోహన్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

'విశ్రాంత విలేకరులకు పింఛను ఇవ్వాలి'

గంగాధరనెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత విలేకరులకు ఇతర రాష్ట్రాల్లోవలే ఇక్కడ కూడా పింఛన్ పథకం అమలు చేయాలని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పలువురు విలేకరులు మంగళవారం గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో డీటీ మహేష్‌కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

'మనమిత్ర'ను సద్వినియోగం చేసుకోండి

విజయపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్(మనమిత్ర)ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్ సూచించారు. మంగళవారం విజయపురంలో దీనిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 95523 00009 నెంబరుకు వాట్సాప్ ద్వారా హాయ్ మెసేజ్ చేస్తే పలు సేవలను ఉపయోగించుకోచ్చన్నారు.

తమిళనాడులో ఇసుక డంప్ సీజ్



విజయపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో డంప్ చేసిన ఇసుకను విజయపురం తహసీల్దార్ కిరణ్ మంగళవారం సీజ్ చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొందరు విజయపురం మండలంలోని కేవీ శ్రీరామాపురం కుశస్థలి నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లి డంప్ చేసి రాత్రి సమయాల్లో తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామన్నారు. ఆంధ్ర సరిహద్దు అయిన నారపరాజుకండ్రిగ సమీపంలోని తమిళనాడు ప్రాంతంలో ఇసుక డంప్‌ను గుర్తించామని తెలిపారు. ఆ రాష్ట్ర అధికారుల అనుమతితో ఇసుకను సీజ్ చేసినట్లు వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్‌తో నిఘా

చిత్తూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై మంగళవారం రెండో పట్టణ పోలీసులు డ్రోన్‌తో నిఘా పెట్టారు. బీఎంఆర్‌గార్డెన్ వెనుక వైపు ఉన్న అటవీ ప్రాంతంలో పరిశీలించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడం, జూదం, గంజాయి విక్రయాలపై ఆరాతీశారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగలేదని గుర్తించినట్లు సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

ముగిసిన గంగమ్మ జాతర

పూతలపట్టు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె గ్రామంలోని ధనుమకొండ గంగమ్మ జాతర మంగళవారం సాయంత్రంతో ముగిసింది. సోమవారం రాత్రి పొలకల సంతగేటులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పుష్పపల్లకిపై పలు గ్రామాల మీదుగా ఊరేగిస్తూ మంగళవారం ఉదయం తిరిగి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలురకాల అభిషేకాలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

వెదురుకుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం రాత్రి తెలిపారు. దేవళంపేటలో కిరణ్‌బాబు(48) బెల్టు షాపు నిర్వహిస్తున్నాడని వచ్చిన సమాచారంతో దాడులు చేశారు. 40 క్వార్టరు మద్యం సీసాలతోపాటు కిరణ్‌బాబు పట్టుబడ్డాడు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రోడ్డులో ఉన్న హజరత్ రసూల్ బాబా దర్గాలో ఉరుసు ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఫకీరు బాబాలు ఊరేగింపుగా వచ్చి బాబా సమాధిపై చద్దర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవంలో నగరవాసులు మతాలకు అతీతంగా పాల్గొన్నారు. నిర్వాహకుడు షాజహాన్ బాష ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఓవైపు వర్షం కురుస్తున్నా.. దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలన్నీ జనంతో కిటకిటలాడాయి.



దుకాణాల వద్ద గుమికూడిన స్థానికులు



దర్గాలో భక్తుల సందడి